దర్యాప్తు సంస్థలకు ఎనీటైం స్వాగతం

మొదటిపేజీ తరువాయి...

మీ పుట్టిన రోజు కేక్ కట్ చేయాలనుకుంటే తెప్పిస్తా..' అంటూ స్పష్టంచేశారు. 'నా అరెస్టు కోసం ఉవ్విళ్లూరుతు న్న రేవంత్‌రెడ్డికి సుంకిశాల ఘటనలో మేఘా కృష్ణారెడ్డిని బ్లాక్ లిస్ట్ చేసే దమ్ముందా.. మే ఘా కృష్ణారెడ్డిని అరెస్ట్ చేసే దమ్ముందా?' అని నిలదీశారు. 'ఆ ఆంధ్రా కాంట్రాక్టర్‌ను.. తన ఈస్ట్ ఇండియా కంపెనీని కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి తీసివేసే దమ్ముందా?.. ముఖ్యమంత్రి స్థానంలో ఉండి మేఘాకు గులాంగిరీ చేస్తున్నావా?' అని నిప్పులు చెరిగారు.

ముఠా పద్మకు కేటీఆర్ పరామర్శ

వెన్నెముక సర్జరీ అనంతరం కోలుకుంటున్న మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు ముఠా పద్మను ముషీరాబాద్‌లోని ఆమె స్వగృహంలో కేటీఆర్ శుక్రవారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి ఎలా ఉన్నది తెలుసుకున్నారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు. కాగా కేటీఆర్ మలేషియా వెళ్లాడని దుష్ప్రచారం కావడంపై బీఆర్ఎస్ నేతలు, ఆయన అభిమానులు భగ్గుమన్నారు. మాజీ కార్పొరేటర్ ముఠా పద్మ ఇల్లు మలేషియాలో ఉన్నదా? అంటూ సోషల్ మీడియాలో సెటైర్లు వేశారు.



వేటు వేయాల్సిందే

ఫిరాయింపుదార్లు ఎమ్మెల్యేలుగా ఒక్కరోజూ కొనసాగే హక్కు లేదు

ఫిరాయింపు క్యాన్సర్ లాంటి మహమ్మారి

హైకోర్టులో బీఆర్ఎస్ వాదన • తదుపరి విచారణ 11న

హైదరాబాద్,నవంబర్ 8(నమస్తే తెలంగాణ): పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌కు పిటిషన్లు సమర్పించి ఆరు నెలలైనా, ఇప్పటికీ విచారణ చేపట్టలేదని బీఆర్ఎస్ తరపున సీనియర్ అడ్వొకేట్ గండ్ర మోహన్‌రావు హైకోర్టులో వాదించారు. స్పీకర్ కాలయాపన చేస్తుంటే రాజ్యాంగ ధర్మాసనాలైన హైకోర్టు, సుప్రీంకోర్టు స్పందించడం తప్ప వేరే మార్గం లేదని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం, రాజ్యాంగంలోని 142వ అధికరణం మేరకు కోర్టులు ఉత్తర్వులు జారీ చేయవచ్చునని చెప్పారు. బీఆర్ఎస్ తరపున గెలిచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై సింగిల్ జడ్జి గతంలో ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలంటూ అసెంబ్లీ కార్యదర్శి వీ నరసింహాచార్యులు రెండు అప్పీల్ పిటిషన్లను దాఖలు చేశారు. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం కూడా విచారణ కొనసాగించింది. గండ్ర మోహన్‌రావు వాదనలు కొనసాగిస్తూ, ఫిరాయింపుల పిటిషన్లను స్పీకర్ హోదాలో విచారణ చేయబోరని, పదో షెడ్యూల్ ప్రకారం ఏర్పడే ట్రిబ్యునల్‌కు చైర్మన్ హోదాలో స్పీకర్ విచారణ చేస్తారని వివరించారు. అధికార పార్టీ తరపున స్పీకర్ పదవిని చేపట్టిన వ్యక్తి అధికార పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్ల విచారణకు ఆసక్తి చూపకపోతే, కోర్టులు జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. ప్రజాతీర్పును కాలరాస్తూ అధికార పార్టీలో చేరిన చట్టసభ సభ్యులపై తక్షణమే చర్యలు తీసుకుంటేనే ప్రజాస్వామ్యానికి అర్థం ఉంటుందని పేర్కొన్నారు.

ఫిరాయింపు జాఢ్యాన్ని ఆదిలోనే తుంచేయాలి

స్పీకర్ తన ముందున్న పిటిషన్లను విచారణ చేపట్టకుండా ఐదేండ్లపాటు కాలయాపన చేసుకుంటూపోతే కోర్టులు చూస్తూ కూర్చోకూడదని, ప్రజాస్వామ్యానికి క్యాన్సర్ వంటి ఫిరాయింపు జాఢ్యాన్ని ఆదిలోనే తుంచివేయాలని హైకోర్టుకు గండ్ర విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగంలోని 226 అధికరణం కింద కోర్టులు స్పీకర్‌కు ఆదేశాలు జారీ చేసేందుకు వీలున్నదా? అని హైకోర్టు ప్రశ్నించింది. సుప్రీంకోర్టు వెలువరించిన నాలుగు తీర్పులను ఉదహరించిన గండ్ర, జోక్యం చేసుకోకపోతే ప్రజాతీర్పుకు, ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం ఏర్పడుతుందని చెప్పారు. సదరు అధికరణంలో శూన్యత ఉన్నప్పుడు రాజ్యాంగ ధర్మాసనాలకు తమకున్న విస్తృతాధికారాలను వినియోగించాల్సిన అవసరం ఎంతగానో ఉన్నదని వాదించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఒక్కరోజు కూడా ఆ పదవుల్లో కొనసాగేందుకు వీల్లేదని చెప్పారు. గతంలో స్పీకర్ తన ముందున్న ఫిరాయింపు పిటిషన్లపై చర్యలు తీసుకోలేదని చెప్పి ఆ విధానాన్ని కొనసాగించి ప్రజలకు తప్పుడు మార్గంలో వెళ్తున్నట్టు చెప్పకూడదని పేర్కొన్నారు. స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన నాలుగు వారాల్లోగా స్పందించాలని, మూడు నెలల్లోగా తగిన నిర్ణయం తీసుకోవాలని, ఇలా జరగనిపక్షంలో హైకోర్టు జోక్యం చేసుకోవడం తప్ప వేరే మార్గం లేదని చెప్పారు. సకాలంలో న్యాయం లభించకపోతే కాలం తీరిన తర్వాత లభించే న్యాయానికి అర్థం ఉండదని, దీని ప్రకారం ఐదేండ్ల పదవీ కాలం ముగిసే దశలోనో, పదవీకాలం ముగిసిన తర్వాతో స్పందిస్తే లభించేది న్యాయం కాబోదని వివరించారు. స్పీకర్ ఎలాంటి తీర్పునైనా చెప్పవచ్చునని, స్పీకర్ తుది నిర్ణయంపై కోర్టులు సమీక్ష చేసేందుకు రాజ్యాంగం వెసులుబాటు కల్పించిందంటూ నిబంధనలను గుర్తుచేశారు. సింగిల్ జడ్జి, స్పీకర్ తన ముందున్న ఫిరాయింపు పిటిషన్లపై నాలుగు వారాల్లో విచారణ షెడ్యూల్ ఖరారు చేయాలని ఆదేశించారని, ఫిరాయింపు పిటిషన్లపై తుది నిర్ణయం స్పీకర్ దేనని చెప్పారు. ఇప్పటికే స్పీకర్‌కు ఫిర్యాదు చేసి ఆరు నెలలు అయ్యిందని, ఇప్పటివరకు విచారణ షెడ్యూల్‌ను కూడా ఖరారు చేయలేదని, ఈ దశలో రాజ్యాంగ పరిరక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. తదుపరి విచారణ సోమవారానికి వాయిదా పడింది.

కేటీఆర్‌ను బద్నాం చేసే కుట్ర

- అందుకే ఫార్ములా ఈ-రేస్‌పై రాద్ధాంతం
- కాంగ్రెస్ వచ్చి ఏడాదైనా గాడిన పడని పాలన
- బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి మండిపాటు

హైదరాబాద్, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ): మాజీ మంత్రి కేటీఆర్ ఇమేజ్‌ను డ్యామేజ్ చేసేందుకే కాంగ్రెస్ ఫార్ములావన్ ఈ-రేస్‌లో అవినీతి అంటూ రాద్ధాంతం చేస్తున్నదని బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి మండిపడ్డారు. 'ఫార్ములా ఈ-రేస్ కంపెనీకి చెల్లించిన డబ్బు కేటీఆర్ జేబులోకి ఎలా వెళ్తది? ఇందులో అవినీతికి ఆస్కారమెక్కడిది?' అని ప్రశ్నించారు. హైదరాబాద్ ఖ్యాతిని పెంచేందుకు తెచ్చిన ఈ రేస్‌లో అక్రమాలు జరిగాయని, బాంబులు పేలుతాయని మంత్రులు బెదిరింపులకు దిగుతున్నారని విమర్శించారు. శుక్రవారం ఆయన తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ సర్కార్ వచ్చి దాదాపు ఏడాది అవుతున్నా గ్యారెంటీల అమలుపై దృష్టిపెట్టడంలేదని దుయ్యబట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి విజన్ లేకుండా ప్రభుత్వాన్ని నడుపుతున్నారని, గత ప్రభుత్వంపై ఆరోపణలతో పబ్బంగడపడం తప్ప ప్రజలకు ఒరగబెట్టిందేమీలేదని ధ్వజమెత్తారు. హైదరాబాద్ ఇమేజ్‌ను ప్రపంచస్థాయికి పెంచిన కేసీఆర్, కేటీఆర్‌ను దెబ్బతీసేందుకు కుట్రలు, కుతంత్రాలకు దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అంతర్జాతీయస్థాయి క్రీడలతో రాష్ట్ర ఖ్యాతి ఇనుమడిస్తుందనే కనీస ఇంగిత జ్ఞానం లేకుండా కాంగ్రెస్ నాయకులు ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. ఇక్కడ జరిగిన ఈ రేస్‌ను వందలాది దేశాల ప్రజలు తిలకించారని గుర్తుచేశారు. 'ఆయన గురువు చంద్రబాబు ఏమీలేని అమరావతిలో కపిల్‌దేవ్‌ను తెచ్చి గోల్ఫ్ కోర్స్ నిర్మిస్తామని చెప్తుంటే, ఇక్కడ శిశ్యుడేమో హైదరాబాద్ ఇమేజ్‌ను దెబ్బతీసేందుకు కుతంత్రాలు చేస్తున్నారు' అంటూ విమర్శించారు. ఎఫ్ఐఏకు మంత్రివర్గ ఆమోదంలేకుండానే నిధులిచ్చారని ఆరోపిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. హైదరాబాద్‌లో రూ.20 కోట్లతో నిర్వహించిన ఫుట్‌బాల్ మ్యాచ్‌కు క్యాబినెట్ ఆమోదాన్ని ఎందుకు తీసుకోలేదని నిలదీశారు. మొదలు కానీ మూసీ ప్రాజెక్ట్ వెంట పెద్దపెద్ద బిల్డింగ్‌లు, అందమైన హోటళ్లు నిర్మిస్తామని చెప్తున్న ఆయనకు, ఈజ్‌ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో హైదరాబాద్‌ను ఆగ్రస్థానంలో నిలబెడితే తప్పులా కనబడడం విడ్డూరమన్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్‌పై ఏడుపుమాని పాలనపై దృష్టిపెట్టాలని హితవుపలికారు.

రేవంత్ పాలనలో తెలంగాణ విధ్వంసం

- మంత్రులవి సోయి లేని మాటలు.. అమలుకు నోచని హామీలు
- శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ఫైర్

ఆకునూరులో మాట్లాడుతున్న శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదనచారి

చేర్యాల, నవంబర్ 8: సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో తెలంగాణ రాష్ట్రం విధ్వంసమవుతున్నదని, బాధ్యయుతంగా ఉండాల్సిన మంత్రులే ఆటంబాంబులు పేలుతాయని మాట్లాడటం సిగ్గుచేటని శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ఫైర్ అయ్యారు. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎంతోపాటు మంత్రులు సైతం సోయిలేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సీఎం పదవి ఒక పవిత్రమైనదని, ప్రజలకు సేవ చేసేందుకు దానిని ఉపయోగించుకోవాలని కానీ.. రేవంత్‌రెడ్డి దిగజారుడు భాష ప్రయోగిస్తుండటంతో ప్రజలు సిగ్గుపడుతున్నారని పేర్కొన్నారు. తామేం తక్కువ కాదన్నట్టుగా మంత్రి పొంగులేటి విదేశాల్లో ఉన్నపుడు బాంబులు పేలుతాయని, తాజాగా ఆటంబాంబు పేలబోతుందని ప్రకటనలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో సంపద పెంచి పథకాల రూపంలో అన్ని వర్గాల ప్రజలకు పంచిపెట్టారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ 6 గ్యారెంటీలను అటకెక్కించి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్న విషయాన్ని మేధావులు, ఉద్యోగులు, నిరుద్యోగులు గమనిస్తున్నట్టు తెలిపారు. రైతుభరోసా, మహిళలకు రూ.2500, కల్యాణలక్ష్మితోపాటు తులం బంగారం ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. ముందుగా ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చాలని సూచించారు. అంతకుముందు విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

డీఏ, పీఆర్సీలకూ సబ్ కమిటీయే..!

సులభమైన సమస్యల పరిష్కారానికిసైతం క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు

దీంతో గతంలో ఏర్పాటుచేసిన త్రిసభ్య కమిటీ బుట్టదాఖలు • పలు కమిటీల ఏర్పాటు పేరుతో సమస్యల పరిష్కారానికి తాత్సారం

హైదరాబాద్, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ): డీఏ (కరువుభత్యం), పీఆర్సీ, పదోన్నతులు, బదిలీలపై నిర్ణయం తీసుకోవడంలోనూ ప్రభుత్వం తాత్సారం చేస్తున్నది. ఉద్యోగుల జేఏసీ లేవనెత్తిన సులభమైన సమస్యలను పరిష్కరించే బాధ్యతలను సైతం క్యాబినెట్ సబ్ కమిటీకి అప్పగించింది. ఈ సబ్ కమిటీకి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చైర్మన్‌గా వ్యవహరించనుండగా, మంత్రులు డీ శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా ఉన్నారు. ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు ప్రత్యేక ఆహ్వానితులుగా, జీడీఏ ప్రిన్సిపల్ సెక్రటరీ మెంబర్ కన్వీనర్‌గా ఉంటారని ప్రభుత్వం శుక్రవారం జారీచేసిన జీవోలో వెల్లడించింది.

14 రోజుల తర్వాత.. అది అడిగితేనే

గత నెల 24న సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో జేఏసీ నేతలు తమ 54 డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు. ఈ డిమాండ్లపై ప్రభుత్వంతో చర్చించేందుకు క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేస్తామని సీఎం అప్పట్లో ప్రకటించారు. సీఎం చెప్పిన 14 రోజులు ఆలస్యంగా క్యాబినెట్ సబ్ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అది జేఏసీ నేతలు వెళ్లి అడిగిన తర్వాతే ప్రభుత్వం జీవో జారీచేసింది. సీఎం చెప్పిన తర్వాత కూడా సబ్ కమిటీని ఏర్పాటు చేయకపోవడంతో ఉద్యోగుల జేఏసీ నేతలు గురువారం సచివాలయంలో సీఎంవో అధికారులను ప్రశ్నించారు. ఇంకా సబ్ కమిటీ ఏర్పాటు చేయకపోవడంపై విస్మయం వ్యక్తం చేశారు. దీంతో ఎట్టకేలకు శుక్రవారం ప్రభుత్వం జీవోను జారీచేసింది. అయితే ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి గతంలో త్రిసభ్య కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జేఏసీ నేతలు పలు ధఫాలుగా వీరితో సమావేశమై చర్చలు జరిపారు. తాజాగా కొత్త క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేయడంతో పాత కమిటీ బుట్టదాఖలు కానుండగా, గతంలో చేసిన కసరత్తు అంతా బూడిదలో పోసిన పన్నీరైంది. ఇలా పలు కమిటీల ఏర్పాటు పేరుతో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తాత్సారం చేస్తున్నదని ఉద్యోగులు మండిపడుతున్నారు.

ఏసీబీకి చిక్కిన వర్ని ఎస్సై

- స్టేషన్ బెయిల్ కోసం రూ.50 వేలు లంచం డిమాండ్
- రూ.20 వేలు తీసుకుంటూ పట్టుబడిన కృష్ణకుమార్

ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన వర్ని ఎస్సై కృష్ణకుమార్

రుద్రూర్, నవంబర్ 8: నిజామాబాద్ జిల్లా వర్ని ఎస్సై కృష్ణకుమార్ లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. స్టేషన్ బెయిల్ కోసం ఓ వ్యక్తి వద్ద రూ.20 వేలు లంచం తీసుకుంటూ శుక్రవారం ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ వివరాలు వెల్లడించారు. కోటయ్య క్యాంపునకు చెందిన నాగరాజుకు ఈ నెల 4న వర్ని వైన్స్ వద్ద శ్రీకాంత్‌తో గొడవ జరిగింది. నాగరాజుతో పాటు మరో ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. స్టేషన్ బెయిల్ కోసం వర్ని ఎస్సై కృష్ణకుమార్ రూ.50 వేలు డిమాండ్ చేయగా.. రూ.20 వేలకు బేరం కుదిరింది. దీంతో నాగరాజు ఏసీబీని ఆశ్రయించాడు. నాగరాజు శుక్రవారం ఉదయం డబ్బులతో పోలీసుస్టేషన్‌కు వచ్చి ఎస్సై కృష్ణకుమార్ చేతిలో పెట్టగా.. ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎస్సైని విచారించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. శనివారం నాంపల్లి కోర్టులో హాజరుపర్చనున్నట్టు డీఎస్పీ శేఖర్‌గౌడ్ తెలిపారు. ఈ దాడిలో ఇన్‌స్పెక్టర్లు వేణుకుమార్, నగేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'మేఘా'అంటే భయమెందుకు రేవంత్?

- నాడు ఈస్టిండియా అన్న కంపెనీకి మూసీ, కొడంగల్ ప్రాజెక్టులివ్వడంలో మర్మమేంటి?
- ఢిల్లీకి డబ్బులు పంపేందుకే కృష్ణారెడ్డితో ఒప్పందం
- కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద

తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద, చిత్రంలో బీఆర్ఎస్ నేతలు ఎర్రోళ్ల శ్రీనివాస్, మేడె రాజీవ్‌సాగర్, రఘువీర్

హైదరాబాద్, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ): ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మేఘా కంపెనీని ఈస్ట్ ఇండియాతో పోల్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు అదే సంస్థకు మూసీ, కొడంగల్, కాళేశ్వరం నుంచి హైదరాబాద్‌కు నీటిని తరలించే ప్రాజెక్టులు కట్టబెట్టేందుకు తహతహలాడడంలో మర్మమేంటి? సుంకిశాల ఘటనకు కారణమైన ఆ సంస్థను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టడంలే దేందుకని కేటీఆర్ డిమాండ్ చేసినా పెడచెవిన పెడుతున్నరెందుకు? ఆ ప్రాజెక్టు కూలిపోయి వందల కోట్ల నష్టం జరిగినా చర్యలు తీసుకోవడంలో తాత్సారమెందుకు? ఎందుకు లాలూచీ పడుతున్నరు? అంటూ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద ప్రశ్నల వర్షం కురిపించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, మేడె రాజీవ్‌సాగర్, బీఆర్ఎస్ నేత రఘువీర్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. మేఘా కంపెనీ ఎండీ కృష్ణారెడ్డి అంటే అంత భయం ఎందుకని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. 'ఢిల్లీలోని మీ పార్టీ అధిష్ఠానానికి డబ్బుల మూటలు పంపించేందుకే ఆ కంపెనీ ఎండీతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్నరా?' అని సూటిగా ప్రశ్నించారు. మేఘా కంపెనీ ఏజెన్సీ చేపట్టిన నిర్మాణ లోపాలతోనే సుంకిశాల కూలిపోయిందని హెచ్ఎండీఏ నివేదించినా చర్యలెందుకు తీసుకోవడం లేదని నిలదీశారు. ఈ అవినీతి వ్యవహారాన్ని బీఆర్ఎస్ ఎట్టిపరిస్థితుల్లో వదిలిపెట్టబోదని తేల్చిచెప్పారు. న్యాయపరంగా, ప్రజాక్షేత్రంలో పోరాడుతుందని హెచ్చరించారు. దేశంలో ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా ఇక్కడి నుంచే డబ్బు సంచులు తరలిస్తున్నారని ఆరోపించారు.

అన్ని రంగాలు నాశనం

కాంగ్రెస్ పదకొండు నెలల పాలనలో అన్ని రంగాలను సర్వనాశనం చేశారని కేపీ వివేకానంద దుయ్యబట్టారు. ప్రతిపక్షాలపై కక్షలు, కుట్రలు తప్ప సాధించేదేమీలేదని విమర్శించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్లను బెదిరిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. హైడ్రా పేరిట బిల్డర్లను బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు దండుకున్నారని విమర్శించారు. ఆర్ ఆర్ (రాహుల్, రేవంత్)ట్యాక్స్‌తో రాష్ట్ర ప్రజలను పీల్చుకుతింటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదానీ, మోదీని డబుల్ ఇంజిన్ సర్కారు అని రాహుల్‌గాంధీ దుయ్యబడుతుంటే, ఇక్కడేమో రేవంత్‌రెడ్డి అదే అదానీకి కాంట్రాక్టులు కట్టబెట్టి ప్రధాని మోదీకి దగ్గరయ్యారని ఆరోపించారు. రాష్ట్రంలో సంజయ్, రేవంత్‌రెడ్డి ఆర్ఎస్ బ్రదర్స్‌గా సహకరించుకుంటున్నారని విమర్శించారు. ప్రశ్నిస్తే కేసులు పెడతామని బెదిరిస్తున్నారని విమర్శించారు.

ఆస్తులు గుంజుకునేందుకే కులగణన

ప్రజల ఆస్తులు గుంజుకునేందుకు కులగణన పేరిట అసంబద్ధ సర్వే నిర్వహిస్తున్నదని వివేకానంద ఆరోపించారు. నాడు సమగ్ర కుటుంబ సర్వేను వ్యతిరేకించిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. చిత్తశుద్ధి ఉంటే కులగణన సర్వేపై అఖిలపక్షాన్ని ఏర్పాటు చేయాలని, అసెంబ్లీని సమావేశపరిచి చర్చించాలని డిమాండ్ చేశారు.

మద్దతు ధర ఇవ్వని కేంద్రాలను ప్రారంభించను

- బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ వినూత్న నిరసన

ఆదిలాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లాలో కేంద్ర ప్రభుత్వం రంగ సంస్థ (సీసీఐ) రైతులకు మద్దతు ధర చెల్లించకపోవడంతో బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. బోథ్ మండల కేంద్రంలో శుక్రవారం మూడు జిన్నింగ్‌లో సీసీఐ పత్తి కొనుగోళ్లను ప్రారంభించాలని మార్కెటింగ్ శాఖ అధికారులు ఎమ్మెల్యేను ఆహ్వానించగా ఆయన నిరాకరించారు. అప్పటికే ఎమ్మెల్యే వద్దకు వచ్చిన రైతులు.. నియోజకవర్గంలో సీసీఐ కేంద్రాల్లో క్వింటాల్‌కు రూ.7,521 మద్దతు ధర చెల్లించడం లేదని తెలిపారు. 12 శాతం తేమ వచ్చినా సీసీఐ అధికారులు తీసుకోవడం లేదని, చేసేది లేక తాము ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు అమ్మి నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో ఆయన సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకుండా నిరసన చేపట్టారు. మద్దతు ధర ఇవ్వని కేంద్రాలను ఎందుకు ప్రారంభించాలని అధికారులను ప్రశ్నించారు. కేవలం ఫొటోలకు ఫోజులివ్వడానికైతే తాను కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేది లేదని తేల్చి చెప్పారు.

268 మంది నర్సులకు పదోన్నతులు

హైదరాబాద్, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ): తెలంగాణ వైద్యవిధాన పరిషత్తులో 268 మంది స్టాఫ్ నర్సులకు పదోన్నతులు కల్పించారు. మల్టీజోన్-1లో 173 మందికి, మల్టీజోన్-2లో 95 మందికి హెడ్ నర్సులుగా పదోన్నతులు కల్పిస్తూ టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్ జాబితా విడుదల చేశారు. ఎంపికైన అభ్యర్థులకు శనివారం ఉదయం హైదరాబాద్‌లోని డీఎంఈ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు వెల్లడించారు. అయితే సీనియార్టీ పాటించడం లేదంటూ 2011 బ్యాచ్‌కు చెందిన పలువురు కోర్టును ఆశ్రయించినట్టు అధికారులు చెప్పన్నారు. ఒక వేళ కోర్టు నుంచి ఆదేశాలు వస్తే ఆ సంవత్సరం బ్యాచ్‌కు చెందిన వారి పదోన్నతులను తాత్కాలికంగా నిలిపివేస్తామని పేర్కొన్నారు. 268 మందిలో 2011 బ్యాచ్‌కు చెందినవారు 26 మంది ఉన్నట్టు వెల్లడించారు.

రేవంత్‌కు బండి సంజయ్ అండ

రేవంత్ సర్కారును కాపాడేందుకు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ తహతహలాడుతున్నారని ఎస్సీ,ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆరోపించారు. కిషన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, బండి సంజయ్ ముగ్గురు కలిసి రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ ఉమ్మడి ప్రభుత్వాన్ని నడుపుతున్నారని ఎద్దేవా చేశారు. మోదీ ఫొటో పెట్టుకొని రెండుసార్లు ఎంపీగా గెలిచి పొరపాటున కేంద్రమంత్రి అయిన సంజయ్ కనీస పరిజ్ఞానం లేకుండా బీఆర్ఎస్‌పై బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పాలనలో అవినితి జరిగిందంటూ 11 నెలల్లో 33 ఎంక్వయిరీలు వేసి ఏం తేల్చారని ప్రశ్నించారు. అటు ఢిల్లీలో ఇటు గల్లీలో వారి ప్రభుత్వాలే ఉన్నా బీఆర్ఎస్ అక్రమాలకు వెలికితీయలేదెందుకని నిలదీశారు. సంజయ్, రేవంత్ చీకట్లో చేతులు కలిపి కేసీఆర్, కేటీఆర్‌ను బద్నాం చేయడమే పనిగా పెట్టుకున్నారన్నారు. వారి బెదిరింపులకు భయపడబోమని, వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కాంగ్రెస్సోళ్లకు మిత్తితో సహా చెల్లిస్తామ ని హెచ్చరించారు. ఈ బాంబులు, ఆ బాం బులంటూ ఎగసెగసి పడుతున్న పొంగులేటికి రాజకీయ భిక్ష పెట్టింది కేసీఆరేననే విష యం గుర్తుంచుకోవాలని హితవు పలికారు.

సర్వేకు ప్రామాణికత ఏదీ?

ఏ లెక్కల ఆధారంగా సమాచార సేకరణ • ప్రజలిచ్చే సమాచారం నిజమా..? కాదా?

పోల్చి చూసేదెవ్వరు..? చూసేది ఎట్లా..? • అనేక ఎంబీసీ కులాలకు సర్టిఫికెట్లే లేని పరిస్థితి • మాదిగ ఉపకులాలదీ అదే దుస్థితి

ఎన్యూమరేటర్లకూ కులాలపై లేని అవగాహన • సమగ్ర సమాచారం సేకరణ సాధ్యమా..! • నేటి నుంచి ఇంటింటి సర్వే.. ఇండ్ల గుర్తింపు పూర్తి

హైదరాబాద్, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ): ఇంటింటి సర్వే చేసి అన్నికులాల సామాజిక, ఆర్థిక తదితర అంశాలపై కచ్చితమైన లెక్కలు తీసి న్యాయం చేస్తామని కాంగ్రెస్ సర్కారు ఊదరగొడుతున్నా ఆచరణలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులే నెలకొన్నాయి. సర్వేకు ప్రామాణికత ఏమిటనే ప్రశ్నలను మేధావివర్గం, బీసీ కులసంఘాలు సందేహాలను వ్యక్తపరుస్తున్నాయి. ఆయా కుటుంబాలు చెప్పే సమాచారం నిజమా? కాదా? అని ఏ ప్రాతిపదికగా నిర్ధారిస్తారు? అలాంటి తులనాత్మక అధ్యయనం లేకుండా కచ్చితమైన సమాచారం ఏవిధంగా వస్తుందని గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో సర్వే ప్రామాణికతనే ప్రశ్నార్థకంగా మారనుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరీ ముఖ్యంగా ఎంబీసీలు, ఎస్సీ ఉపకులాల ప్రజలు తీవ్ర అభ్యంతరాలను వెలిబుచ్చుతున్నారు.

యజమానులు చెప్పిందే రాసుకోవడం!

ఇంటింటి